# పంజరం కోరిన పక్షి

- చిట్టిపెద్ది ఉమ

పదిరోజులు ఇంకా పదిరోజుల్లో తన జాతకం మారిపోతుంది. పూరిగుడిసెలోంచి ఓ అందాల భరిణ రాజమహల్‌లోకి అడుగుపెట్టి రాకుమారిగా మారిపోయినట్టు మారిపోయింది. రూపాయికీ రూపాయికీ లెక్క చూసుకుని ఖర్చుచేస్తూ కొంత కూడబెట్టుకుంటూ వస్తున్న తనకి ఇంక వందలకి, వేలకీ లెక్క చూసుకోనక్కర్లేదు.

కూడబెట్టుకోవాల్సిన పని అసలేలేదు. పదితరాలకీ సరిపడే ఆస్తి, ఐశ్వర్యం.. అరడజను కార్లు, హోండాసిటీ, లాన్సర్, ఎస్టీమ్, ఫోర్డ్...అబ్బ ఈ కార్లలో కొన్నింటిని తను రోడ్డుమీద కూడా చూడలేదు.

కోనసీమలో చిన్న పల్లె నుంచి హైద్రాబాద్‌లోని పెద్ద ఇండస్ట్రియలిస్టుల ఇంట్లోకి ప్రవేశిస్తుంది.

అసలు బాబాయిగారింటి పెళ్లికి నాన్నగారు ఒక్కరే వెళ్ళాలనుకున్నారు.

ఆఖరి నిముషంలో ఆడపెళ్లివారి తరఫున అరుంధతి రావడం, తనని చూసి కొడుక్కి చేసుకుంటాననడం ఓహ్.. అంతా కలలోలా జరిగిపోయింది. కానీ చిన్న అపశృతి... అనూష.

"విద్యా...నీకు ఫోన్" హరిణి వదిన కేకేసింది.

""నీకాబోయే అత్తగారింట్లోంచి అనూషట.." అనూష పేరు వింటూనే విద్య తన మొహంలో అయిష్టం కప్పిపుచ్చుకోవడానికి చాలా శ్రమపడింది.

"అనూష ఇలాంటిది అనుకోలేదు. ఎన్నాళ్ళ స్నేహం... అయినా అనూషని తను గుర్తించలేదు. అందుకే అంటారు మనిషి రూపం లోపల వేరు. బయట వేరు అని.."

"విద్యా... నేను నీతో పర్సనల్‌గా మాట్లాడాలనుకుంటున్నాను. మీ బాబాయి గారింటికి రానా? కాస్సేపు ఎటయినా వెళ్ళి మాట్లాడుకుందాం"

విద్య అటూ ఇటూ చూసింది ఫోన్ దగ్గరలో ఎవరూ లేరు.

"అనూ.. మేం ఇప్పుడు బయటికి వెళ్తున్నాం. అందరూ రెడీ అయిపోయారు. సారీ... ఇంకోసారి" విద్య అనూషకి ఇంకో మాట మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా పెట్టేసింది.

★ ★ ★

అనూష కాలేజీలో అయిదేళ్ళు విద్య బెస్ట్ ఫ్రెండ్. "తన గురించి తనకెంత తెలుసో, అనూష గురించీ తనకు తెలుసనుకుంది. కానీ అనూష గురించి తనకేం తెలియదు.

అనూషని ఎంత పొరపాటుగా అంచనా వేసింది తను.."కాలేజీలో అనూషకీ, విద్యకీ లక్ష్మి సరస్వతులనీ పేరు.

రూపంలో ఒకరికొకరు తీసిపోనట్టు మెరుస్తూ ఉండేవారు.

అభిప్రాయాలు, అభిరుచులు కూడా ఇంచుమించు ఒక్కటే.

అటు చదువులోనూ, డిబేట్లలోనూ ఇద్దరూ నువ్వా-నేనా అన్నట్టు పోటీపడ్డా ఏనాడూ ఎవరు ఫస్ట్, ఎవరు సెకండ్ అన్నది పట్టించుకోలేదు.

అనూష ఫస్ట్ వస్తే విద్య సంతోషపడేది. విద్యకి వచ్చినా అనూష సంతోషం వ్యక్తం చేసేది. ర్యాంకులు, ప్రైజ్‌లు అన్నీ ఇంచుమించు వాళ్లిద్దరి మధ్యే. చిత్రంగా జీవితంలోనూ మళ్లీ ఇద్దరికీ అలాంటి అవకాశమే వచ్చింది.

తరుణ్ అనూష మరిది.

"అనూష అత్తగారు అనూష పెళ్ళిలో తనని చూసిందట. అప్పుడే తరుణ్ కోసం మాట్లాడమంది. అనూష పెళ్ళయిన కొత్తలో రెండుసార్లు ఊరికి వచ్చింది. కానీ వాళ్ళ అత్తగారి అభిప్రాయం తన దగ్గరా అనలేదు. తనింట్లో వాళ్లతోటీ అనలేదు. ఎందుకని... వాళ్ళన్నయ్యకి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. ఎక్కడున్నాడో తెలియదు అందిట. అనూష తెలుసుకోవాలనుంటే తన అడ్రస్ తెలుసుకుని ఉండేది. అన్నయ్యకి ట్రాన్స్‌ఫర్ అయినా తన తండ్రి పేరు, తాముండే పల్లెటూరి పేరు అనూషకి తెలుసు. ఊళ్ళో అడుగుపెట్టి ఎవరిని అడిగినా చెప్పేవాళ్ళు. తనకీ అంత మంచి సంబంధం అవుతుందని ఈర్ష్య..కుళ్ళు..."

పల్లెటూర్లో కాలేజీ లేదని విద్య అన్నయ్య శ్రీధర్ ఇంట్లో ఉండి డిగ్రీ పూర్తిచేసింది. అప్పుడే అనూష పరిచయం..

స్నేహం. విద్యకి ఎంత వద్దనుకున్నా అనూష ప్రవర్తన గుచ్చుకుంటూనే ఉంది.

"విద్యా...రేపు వాళ్లందరూ అబ్బాయితో వచ్చి చూస్తారుట. కానీ స్వాగత్‌లో రూమ్ బుక్ చేశాం. అక్కడికి వచ్చి చూపించండి అన్నారు.." రామావతారం.

కూతురికి అంత మంచి సంబంధం కుదరబోతున్నందుకు సంతోషంగానే ఉన్నా వాళ్ళు పెళ్ళిచూపులకి కూడా ఇంటికి రాకుండా వాళ్ల స్టేటస్ ప్రకారం జరిపించాలనుకోవడం..హోటల్ రూమ్-బుక్‌చేసే తాహతు తమకి లేదు. కాబట్టి మేమే చేస్తాం అన్నట్టు మాట్లాడడం రామావతారానికి కాస్త అసంతృప్తిగానే ఉంది.

మర్నాడు 'స్వాగత్'లో అరుంధతి, రామకృష్ణగార్లు అనూష, అనూష భర్త హరణ్, తరుణ్ అందరూ వచ్చి లాంఛనంగా విద్యని చూసి ఓకే చేసి వెంటనే డైమండ్‌రింగ్, పదివేలరూపాయల పట్టుచీర పెట్టారు.

అదే రాత్రి అరవింద్ పెళ్ళికి వచ్చి ఇంకా వెళ్లని బంధువులనీ, వాళ్ల స్నేహితులనీ కొందరినీ పిలుచుకుని గ్రాండ్‌గా అదే హోటల్లో డిన్నర్ ఇచ్చారు.

విద్యకి అంతా కలా, నిజమా అన్నంత విభ్రమం. డబ్బు వాళ్ళు ఖర్చు చేయడం తమ లేమిని ఎత్తి చూపిస్తున్నట్టు అన్పించినా రామావతారం మంచి సంబంధం అనుకుని సర్దుకుపోయాడు.

వాళ్లకుంది కాబట్టి కొడుకు, కోడలు కోసం ఖర్చుపెట్టుకుంటున్నారు అని సరిపుచ్చుకున్నాడు. విద్య అదృష్టాన్ని అందరూ ఆకాశానికెత్తేశారు. పెళ్ళి ఖర్చు తామే భరించి తమ స్టేటస్‌కి తగ్గట్టుగా హైద్రాబాద్‌లో జరిపిస్తామన్నారు రామకృష్ణగారు. పదిరోజుల్లో ముహూర్తం పెట్టేశాడు పురోహితుడు.

"నా పెళ్ళి ఖర్చు కూడా అత్తయ్యా, మామయ్యే గార్లే పెట్టుకున్నారు" అనూష రామావతారం గారి ఇబ్బంది గమనించినట్టు అంది.

"మీ ఇద్దరూ మంచి స్నేహితురాళ్ళు...ఒకే ఇంటి కోడళ్ళవడం..ఇంత చిన్నటి మనుష్యుల మధ్య పడడం... నాకు చాలా ఆనందంగా ఉంది..విద్య గురించి నాకింక బెంగలేదు" రామావతారం గారు సంతృప్తిగా అన్నారు మనస్సులో ఏదో కలుక్కుమంటున్నా.

'అనూష తన ఫ్రెండ్. క్లోజ్ ఫ్రెండ్. తన తోడికోడలు..ఎంతో ఆనందంగా అనిపించాల్సిన విషయం.

కానీ.. అనూష ఎందుకలా చేసింది. ఆ ఇంట్లో తను మెట్టకూడదని, తనకి పట్టిన అదృష్టం ముఖ్యంగా నాకు పట్టకూడదనుకుందా?'


విద్యకి ఏదో వెలితిగా అనిపించింది.

"అరుంధతి అనూషతో ప్రత్యేకంగా తన గురించి వాకబు చెయ్యాలనుకున్నప్పుడు ఎందుకు అబద్ధం చెప్పింది. వాళ్ళు ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయారు ఎక్కడికెళ్లారో తెలియదంటూ. నిజానికి శ్రీధర్‌కి ట్రాన్స్‌ఫర్ ఏడాది తర్వాత అయింది.

ఓసారి అనూషని తను కల్సింది కూడా. అనూష తన అదృష్టాన్ని అడ్డుకోవాలని చూసినా అదృష్టం తనని వరించనే వరించింది. తరుణ్ అందగాడు. చదువు గ్రాడ్యుయేషన్ అయినా బిజినెస్ చూసుకోగల తెలివి ఉన్నవాడు. మనుష్యులు మంచివాళ్ళు.

అమ్మాయిని నెత్తిమీద పెట్టుకుంటారు. మీకింక దిగులు లేదని దూరపు బంధువులు రామావతారానికి భరోసా ఇచ్చారు.

పదిరోజుల తర్వాత విద్య పెళ్ళి తరుణ్‌తో అంగరంగ వైభోగంగా జరిగిపోయింది. అనూష భర్త సింగపూర్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు.



అనూష వేవిళ్లని వచ్చింది హైద్రాబాద్.

పెళ్ళయిన నాలుగురోజులకే అనూష భర్తతో సింగపూర్ వెళ్ళిపోయింది.

అత్తగారు, మామగార్లతో తరుణ్, విద్య మాత్రమే ఉంటున్నారు ప్రస్తుతం. హనీమూన్, సినిమాలు, షికార్లు అన్నీ అయి నాలుగునెలలు గడిచేసరికి విద్యకి ఐశ్వర్యం, ఆహారం, కార్లు కొత్తదనాన్ని ఇవ్వడం మానేశాయి.

అన్నీ ఉన్నా ఏదో లోటు..

అదేంటి?

అత్తగారు, మామగారు మంచివాళ్లే. తరుణ్‌కి సిగరెట్, మందు అలవాట్లు ఉన్నాయి.

అయినా డబ్బున్నవాళ్ళకి ఉండే అలవాట్లు అవి.

అవి వదిలేస్తే తరుణ్ మంచివాడే.

ఇవన్నీకాదు. ఏదో లోటనిప్పిస్తోంది.

"అమ్మగారూ రాత్రికి ఏం వండను" తాయారమ్మ అడిగింది వినయంగా.


## అంతరించనున్న ఆర్కిటిక్

ఒకనొకప్పుడు యూరోప్ నుంచి ఇండియాకి, అరబ్ దేశాలకి నౌకాయానం కోసం శాస్త్రజ్ఞులు ఎంతో కష్టపడి సూయెజ్ కాలువని రూపొందించాల్సి వచ్చింది. కానీ ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ పుణ్యమాని ఆర్కిటిక్‌లోని మంచు కరిగిపోవడంతో అట్లాంటిక్, ఫసిఫిక్ మహా సముద్రాల మట్టం పెరిగి సూయెజ్ కెనాల్ వెడల్పు విపరీతంగా విస్తరించిపోతోందిట. దీనివల్ల షిప్పింగ్ బిజినెస్ చేసేవాళ్లకి వరమానందంగా ఉండొచ్చు గానీ మహాసముద్రాల్లోని అనేక చిన్న దీవులు క్రమక్రమంగా మునిగిపోయి అక్కడి ప్రజలు వలసపోవాల్సిన గతి పడుతోంది. యుఎస్ స్టడీస్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రకారం 2080 నాటికి ఆర్కిటిక్‌లోని మంచు చాలావరకూ కరిగిపోతోందిట. మరో పదేళ్లల్లో అమెరికానుంచి జపాన్, రష్యాలకి వెళ్లే ఓడలు ఆర్కిటిక్ రూట్‌లో వెళ్ళినా ఆశ్చర్యం లేదంటున్నారు.

## రియల్ టార్జాన్

నైజీరియాలో కానో అనే ఊళ్ళోకి ఆరేళ్లక్రితం కొందరు వేటగాళ్ళు అడవిలో దొరికాడంటూ ఓ పిల్లవాడ్ని చిల్డ్రన్స్ హోంకి తీసుకువచ్చారు. మెంటల్‌గా, ఫిజికల్‌గా వికలాంగుడైన ఆ పిల్లవాడి అప్పటి వయసు 18నెలలు. చింపాజీలు అతన్ని పెంచడం చూసి తెచ్చామని వేటగాళ్ళు చెప్పారు. బహుశా వికలాంగుడు కావడం మూలానే తల్లిదండ్రులు వాడ్ని అడవిలో విడిచి ఉంటారని అంటున్నారు.

-తటవర్తి



విద్య ఫ్రిజ్ తెరిచి అత్తగారు, మామగారు, తరుణ్ అందరి ఇష్టాలూ గుర్తుతెచ్చుకుని వంకాయకూర, బెండకాయ వేపుడు, టమాటా చారు క్యారెట్ పచ్చడి చెయ్యమంది.

రాత్రి అన్నంతోపాటు పుల్కాలు ఎలాగూ...

"నలుగురి వంట ఎంతసేపు... నేనే చేస్తానత్తయ్యా" పెళ్ళయ్యాక విద్య అడిగింది అత్తగారిని.

"మా ఇంటి కోడళ్ళు వంటింటి కుందేళ్ళుగా ఉండడం మాకిష్టంలేదు.." అరుంధతి ఒప్పుకోలేదు.

"అస్తమానూ నీకు వీణవచ్చుకదా అని టున్-టున్ మనిపించకు. విసుగ్గా ఉంటుంది" తరుణ్ ఉండే సమయాల్లోనే కాదు లేని సమయంలో కూడా వీణని ముట్టుకోవడం తరుణ్‌కి పెద్దగా నచ్చదు అని అర్థమైంది విద్యకి.

గార్డెనింగ్‌కి మాలి, వంటకి వంటమనిషి.పనిమనిషి సరేసరి. విద్య పని అలంకరించుకుని ఎప్పుడూ టిప్‌టాప్‌గా ఉంటూ ఆ ఇంట్లో అటూ ఇటూ తిరగడమే.

బోర్ అన్పించి ఎక్కడైనా టీచర్‌గా చేరతానని తరుణ్‌తో అంది విద్య.

తరుణ్ మొహం చిట్లించాడు.

"ఈ ఇంటి కోడళ్లకి అలాంటి ఉద్యోగాలు చేయాల్సిన ఖర్మలేదు"

"డబ్బుకోసం కాదు. పోనీ ఏదైనా హేండీకేప్డ్ స్కూల్లో వాలంటీర్‌గా.."

"కుదరదు..." ఈ ఇంటి కోడళ్ళు ఉద్యోగం కోసం గడపదాటి వెళ్ళే ప్రసక్తి లేదని తేల్చేశాడు తరుణ్.

ఉద్యోగం కోసమే కాదు అసలు ఆ ఇంటి కోడళ్ళు గడపదాటే సందర్భాలే చాలా తక్కువని మెల్లిమెల్లిగా అర్థమవుతోంది విద్యకి.

విద్యకి టీవీ కతుక్కోవడం అస్సలు నచ్చదు. ఎంతసేపని పేపర్, పుస్తకాలు చదువుతుంది.

విసుగనిపిస్తోంది ఆమెకి.

"పనివాళ్ళ దగ్గర యజమానురాలిలాగా హుందాగా ఉండాలి. వాళ్లతో చనువుగా మాట్లాడకూడదు" అత్తగారు చెప్పింది ఓరోజు.

తరుణ్ లేట్‌గా వస్తాడు...ఆ తరువాత భోజనం నిద్ర...

అత్తగారు, మామగార్లు పెద్దవారు వాళ్ళ దగ్గర ఒదిగి వీలయినంత తక్కువ మాట్లాడాలి.

విద్యకి ఎవరో నోరు నొక్కేసినట్లు ఉంది.

అరుంధతి ఓరోజు విద్యను తనతో లేడీస్ క్లబ్‌కి తీసికెళ్లింది.

కొంచెం మార్పుగా ఊపిరాడనట్టు అనిపించింది విద్యకి 'స్త్రీ నాడు-నేడు' టాపిక్ మీద చర్చ అవుతుంటే విద్య ఉత్సాహంగా మాట్లాడింది అందరికన్నా ఎక్కువగా.

ఇంటికొచ్చిన అరుంధతి ధుమధుమలాడింది.

"ప్రెసిడెంట్‌గారి మాటలకి ఎగైనెస్ట్‌గా మాట్లాడతావా. ఆవిడ మాటల్ని తప్పు అని నిరూపించుకోవాలనుకోవడం తప్పు. పెద్దలతో ఎలా మాట్లాడాలో ఎలా గౌరవమివ్వాలో నేర్చుకో" అంటూ. విద్యకి తను మాట్లాడిన దాంట్లో తప్పేంటో అర్థంకాలేదు.

విద్య బర్త్‌డే అని తరుణ్ ఓ చీర, ఓ గొలుసు తెచ్చిచ్చాడు.

"చాలా బావున్నాయి కానీ మనం ఇద్దరం కలిసి వెళ్ళి సెలెక్ట్ చేసుకునేవాళ్లం కదా"

"ఈ ఇంటి ఆడవాళ్ళు అలా బజార్ల చుట్టూ తిరగడం మాకిష్టం ఉండదు. నీకంతగా సెలెక్ట్ చేసుకోవాలంటే షాపువాళ్ళే ఇంటికొచ్చి చూపిస్తారు. ఇప్పటికీ మా అమ్మగారు నాన్నగారు తెచ్చిన చీరకట్టుకుంటుంది" తరుణ్ మాటలు చేష్టలు ఆ ఇంట్లో వ్యక్తుల స్వభావాలు విశ్లేషించిన కొద్దీ అర్థమవుతోంది ఆ ఇంట్లో ఉన్న లోటు ఏమిటో. స్వేచ్ఛ... ఇక్కడ తనకి అన్నీ అమరుతాయి. కానీ ఏదీ తను స్వతంత్రంగా చెయ్యలేదు. చెయ్యకూడదు. ప్రతి అడుగూ, ప్రతి

మాటా స్టేటస్ ప్రకారం ఆచితూచి వెయ్యాలి.

భర్త, అత్తమామలు ఇచ్చిన నగలు, చీరలు తనకు నచ్చినా, నచ్చకపోయినా ధరించాలి.

ఎప్పుడో పార్టీలకి వెళ్ళినప్పుడు తరుణ్ పక్కన ఒద్దికైన బొమ్మలా నిలబడి చిరునవ్వులు చిందించాలి.

అత్తగారి వైపు చుట్టాలు నీ ఫ్రెండ్స్ వస్తే అణగి ఉన్న కోడలిలా అత్తగారి వెనకాల ఉండి ఆవిడ మాటలకి సపోర్ట్ ఇస్తుండాలి.

పనివాళ్లతో వాళ్ళు చేయించమన్న పనులు మాత్రమే చేయించాలి. ఎక్స్‌ట్రా తెలివితేటలు ఉపయోగించకూడదు.

మాలి చేత కాక్టస్ మొక్కలు తెప్పించినప్పుడు అత్తగారికి వచ్చిన కోపం చూశాక అర్థమైన సత్యం అది.

"ముళ్ళమొక్కలు ఇంట్లో ఉండకూడదు..." అరుంధతి ఆరోజు వాటిని గార్డెన్‌లోంచి తీయించేసింది.

'కోడళ్ళ దగ్గర ఆవిడ పెత్తనం చెల్లుతుంది.

కానీ భర్త, పిల్లల దగ్గర ఆవిడ పరిస్థితీ తనలాంటిదే...

అనూష భర్త కూడా ఈ ఇంటి మొక్కేగా అతనూ' విద్య ఆలోచనలో పడింది.

పెళ్ళయి నాలుగునెలల పైన అయింది.

అత్తగారింట్లో అన్నీ ఉన్నా ఊపిరాడని తనం పుట్టింటిని గుర్తుకుతెచ్చింది. ఓసారి వెళ్ళి వస్తానంది అత్తగారితో.

"అక్కడ ఇమడగలవా... ఎవరిని చూడాలని ఉంటే వాళ్ళనే ఇక్కడికి వచ్చి నాలుగురోజులుండి వెళ్ళమను" అరుంధతి మాటలు తరుణ్ మాటలూ ఒక్కటే.

'ఇమడలేనా? అక్కడేగా తను ఇరవై రెండేళ్ళు పెరిగింది...' ఆశ్చర్యంగా అనుకుంది విద్య.

ఏది ఏమైనా తనింక స్టేటస్ తక్కువ పుట్టింట్లో అడుగుపెట్టలేదు.

"అబ్బ ఈ చిలక్కి ఎంత ఆశో..ఎగిరిపోవాలని...గింజలు వేసేలోపల బయటికి వచ్చేయాలని చూస్తుంది" రంగమ్మ పంజరంలో చిలక్కి గింజలు, పండు ముక్కలు పెడ్తూ అంది అక్కడే కూర్చున్న విద్య వినేట్టుగా.

'ఈ ఇంట్లో చేరిన చిలక బయటికి వెళ్లడమే.. ప్రాణం ఉండగా నెవ్వర్...' విద్య దిగులుగా అనుకుంది.

ఒంటిమీద ఉన్న ఖరీదైన చీర నగలు బరువుగా, భారంగా తోస్తున్నాయి.

అనూష డెలివరీకి హైద్రాబాద్ వచ్చింది.

అనూష పుట్టింటివాళ్లు విద్య పుట్టింటివాళ్లలాగే ఓ మాదిరి మధ్యతరగతి వాళ్ళే.

అందుకే అక్కడికి పంపదల్చుకోలేదు అరుంధతి, రామకృష్ణ. పెళ్ళయ్యాక అనూష భర్తతో ఎక్కువరోజులు ఉండకుండా వెళ్ళిపోవడంతో ఎక్కువ మాట్లాడుకునే అవకాశం రాలేదు విద్య,

అనూషకి. ఇద్దరిమధ్యా ఉన్నా అపోహ తెర ఒకటి. అనూష ప్రవర్తనకి ఏ కారణం ఉందో?

ఏమైనా తను ఈ ఇంటికే వచ్చింది. విద్యకి ఇప్పుడు అనూష మీద కినుక లేదు.

అసలు అనూషని చూస్తూనే ప్రాణం లేచి వచ్చింది.

పాత స్నేహితురాలు ఆపురాలిలాగే కన్పించింది. మనసు విప్పి మాట్లాడడానికి ఓ తోడు దొరికింది.

"ఎలా ఉంది లైఫ్?" అనూష నవ్వుతూ అడిగింది.

"బాగానే ఉంది...పెళ్ళికి ముందు ఒంటరిగా ఏదో మాట్లాడాలన్నావు ఏంటి? అప్పుడు మనం విడిగా కలుసుకోవడానికి టైం దొరకలేదు.."

"నాలుగునెలల్లో నీకర్థమై ఉండాలే.." అనూష మాటలకి అర్థం చక్కగా అర్థమైపోయింది విద్యకి.

ఎందుకంటే అనూష, తనూ ఒకేలాగా ఆలోచిస్తారు.

ఇదో బంగారు పంజరం..

పంజరంలోని అడుగుపెట్టిన చిలక మరి బయటికి వెళ్లలేదు. స్వేచ్ఛగా ఎగరలేదు.


బజార్లో అందమైన వస్తువులు కనిపిస్తే కొనితెచ్చి వాటిని షోకేసుల్లో పెట్టుకుంటాం.

తనూ, అనూషా లాంటి షోపీస్‌లు. అందమైన బొమ్మలు, అనూషకి పంజరంలో చేరేవరకూ అది పంజరం అని తెలియదు.

తనకి తెలుసుకునే అవకాశం వచ్చినా జారవిడిచి వెళ్ళి వెళ్లి పంజరంలో ఇరుక్కుంది.

తనో పంజరం కోరిన పక్షి.

★



## ఆశ్చర్యం

మొన్నామధ్య కొలంబోలో జరిగిన ఓ మ్యూజికల్ నైట్ అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే సాధారణ భద్రతా ఏర్పాట్ల మధ్య షారూక్‌ఖాన్, ప్రియంకాచోప్రా, సయీఫ్ అలీఖాన్, ప్రీతీజింతా, సెలీనాజైట్లీ, జాయెద్ ఖాన్ తదితరులు పాల్గొన్న ఈ షో అందర్నీ ఆకట్టుకుంది. కానీ ఈ సందర్భంగా జరిగిన ఓ బాంబు పేలుడులో ఇద్దరు చనిపోవడం, 18మంది గాయపడడం చాలా విచారంగా అన్పించిందంటున్నాడు షారూక్. 'స్వదేశ్' చిత్రంలో మళ్లీ జనం ముందుకి రాబోతున్న ఎస్సార్కె ఆ షాక్‌నించి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాడు.

